జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
గురువారం
18 12 2025
సంపుటి 1 సంచిక 27
పేజీలు : 04
RNI : TGTEL/25/A4195



## విలేకరులు కావలెను
నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ క్రైమ్ రిపోర్టర్లు


7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)




### హడ్కో నుంచి 5 వేల కోట్ల రుణం
ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులను వేగవంతం చేస్తోంది. ఇందుకోసం హడ్కో నుంచి ప్రభుత్వం రూ. 5 వేల కోట్ల రుణాన్ని సమీకరించింది. ఈ నిధులతో నిలిచిపోయిన పాత బిల్లులను త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.
2



### పంచాయతీ ఎన్నికలతో గులాబీ జోష్..
తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు ముగింపు కు వచ్చాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించింది. బీఆర్ఎస్ పార్టీ కూడా మంచి పోటీ ఇచ్చింది. గ్రామాల్లో పట్టు కోల్పోలేదని రుజువైంది.
3



### అమరావతి వర్సెస్ ఫ్యూచర్ సిటీ
ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలు చెరో కొత్త నగరాన్ని నిర్మించే పనిలో ఉన్నాయి. ఏపీ ముఖ్యమంత్రి రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్మించే ప్రయత్నం గత ఆరేళ్లు గా చేస్తూనే ఉన్నారు.
4




ఐబొమ్మ రవిపై పోలీసులు కేసులు నమోదు

# ఆగని పైరసీ

## ఒక్కో కేసుకూ 3 రోజుల చొప్పున.. 12 రోజులు కస్టడీకి అనుమతి.

**దశ, హైదరాబాద్:** ఐబొమ్మ రవిపై పోలీసులు 4 రకాల కేసులు నమోదు చేశారు. ఇప్పటికే అతన్ని రెండుసార్లు కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించారు. అది ఏమాత్రం చాలలేదని చెబుతూ.. మళ్లీ కస్టడీ కోరారు. దాంతో కోర్టు.. 4 కేసుల్లోనూ కస్టడీకి అనుమతించింది. ఒక్కో కేసుకూ 3 రోజుల చొప్పున.. 12 రోజులు కస్టడీకి అనుమతించింది. అందువల్ల పోలీసులు గురువారం నుంచి మళ్లీ రవిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించడం మొదలుపెడతారు. ఇదంతా ఓకే.. కానీ అసలు సమస్య సాల్వ్ అవ్వలేదు.రవి అరెస్టు తర్వాత పైరసీ ఎక్కడా ఆగలేదు. కొత్తగా రిలీజ్ అవుతున్న అన్ని సినిమాలూ ఎప్పట్లాగే పైరసీ అవుతున్నాయి. ఒక్క సినిమా కూడా పైరసీ అవ్వకుండా ఆగింది లేదు. మరి రవిని అరెస్టు చేసి పోలీసులు సాధించింది ఏంటి? అనే ప్రశ్న వస్తోంది. అసలు పైరసీ ఎందుకు ఆగట్లేదు అనేది మనం లోతుగా ఆలోచించాల్సిన విషయం. ఎందుకు అంటే.. రవి.. ఏ కొత్త సినిమానూ డైరెక్టుగా పైరసీ చెయ్యలేదు. అంటే.. థియేటర్‌కి వెళ్లి.. రహస్యంగా వీడియో రికార్డులు చెయ్యడం వంటివి రవి చెయ్యలేదు. అతను ఇతర పైరసీ సైట్ల నుంచి పైరసీ సినిమాల్ని తీసుకొని.. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. అందువల్ల అసలు పైరసీ సైట్లు అలాగే ఉన్నాయి. వాటిని పోలీసులు బ్రేక్ చెయ్యలేకపోతున్నారు.

మిగతా 4వ పేజీలో

# ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను కొట్టివేత

## ఎమ్మెల్యేల విషయంలో సంచలన నిర్ణయం తీసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్..



దశ, హైదరాబాద్


తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పార్టీ ఫిరాయించిన ఐదుగురు ఎమ్మెల్యేల విషయంలో సంచలన నిర్ణయం ప్రకటించారు. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు నిరూపితమైన ఆధారాలు లేవని స్పీకర్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో చేరారని అనర్హతా వేటు వేయాలని బీఆర్ఎస్ ఇచ్చిన పిటిషన్లను స్పీకర్ తిరస్కరించారు.

**1. తెల్లం వెంకట్రావు, 2. అరికెపూడి గాంధీ, 3. బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, 4. టి. ప్రకాశ్ గౌడ్, 5. గూడెం మహిపాల్ రెడ్డి**

ఈ ఐదుగురిపై అనర్హతా పిటిషన్లను తిరస్కరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు 2024లో కాంగ్రెస్‌పార్టీలోచేరారు. బీఆర్ఎస్‌నాయకులు ఈ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ స్పీకర్‌కు పిటిషన్లు దాఖలు చేశారు. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం, పార్టీ మారితే అనర్హత వేటు పడుతుంది. కానీ అధికారికంగా పార్టీ మారితే లేకపోతే పార్టీ విప్ ధిక్కరించాల్సి ఉంటుంది. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని మర్యాదపూర్వకంగా సీఎంను కలిశామని చెబుతున్నారు. తమ కాంగ్రెస్ పార్టీ కండువాను ధరించలేదని చెబుతున్నారు. మిగిలినవారు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్ ఉన్నారు. వీరిపై కూడా విచారణలు జరిగాయి. వీరిలో కడియం శ్రీహరి, దానం నాగేందర్ ఇంకా స్పీకర్ కు నిర్ణయం చెప్పలేదు.

మిగతా 4వ పేజీలో

## స్కూల్ ఐడి కార్డు ట్యాగ్ లో విద్యార్థి ఆత్మహత్య




**దశ, రంగారెడ్డి:** హైదరాబాద్‌లో దారుణం ఘటన చోటుచేసుకుంది. స్కూలు ఐడీ కార్డు ట్యాగ్‌తో ఉరివేసుకుని 9 ఏళ్ల బాలుడి ఆత్మహత్య చేసుకున్నాడు. చందానగర్ పరిధి రాజేంద్రనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వాచ్‌మెన్ శంకర్ కుమారుడు ప్రశాంత్(9) తన స్కూలు ఐడీ కార్డు ట్యాగ్‌తో బాత్ రూంలో ఉరేసుకుని సూసైడ్ చేసుకున్నాడు. అయితే ఇది సూసైడా?.. ఎవరైనా చంపి ఆత్మహత్యగా క్రియేట్ చేశారా అనేది తేలాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భారత్ పాస్ పోర్టుతో ఆస్ట్రేలియాలో నివాసం: డీజీపీ శివధర్ రెడ్డి

**దశ, హైదరాబాద్:** ఆస్ట్రేలియాలోని సిడ్నీలో కలకలం సృష్టించిన బోండీ బీచ్ ఉగ్ర దాడికి సంబంధించి వెలువడిన తాజా వివరాలు దేశంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో తీవ్ర కలకలం రేపాయి. మారణహోమం సృష్టించిన ఇద్దరు ఉగ్రవాదుల్లో ఒకడైన సాజిద్ అక్రమ్ మూలాలు హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతంలో ఉన్నాయని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం అధికారికంగా ప్రకటించారు.

ఈ ప్రకటన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఒక్కసారిగా చర్చనీయాంశమైంది.ఐసిస్ ప్రేరేపిత ఉగ్ర దాడిగా ఆస్ట్రేలియా పోలీసులు ప్రకటించిన ఈ దాడిలో మొత్తం 15 మంది దుర్మరణం చెందారు. ఈ దారుణానికి పాల్పడిన తండ్రీ కుమారులు సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్‌లలో సాజిద్ పోలీసుల కాల్పుల్లో అక్కడికక్కడే హతమయ్యాడు. కాగా అతడి కుమారుడు నవీద్ అక్రమ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఒక అంతర్జాతీయ ఉగ్ర




దాడిలో నిందితుడికి హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నాయనే వార్త తీవ్ర భయాందోళనలను కలిగించాయి. సాజిద్ అక్రమ్ జీవన ప్రయాణం చాలా మందికి తెలియని ఒక చీకటి కోణం.

మిగతా 4వ పేజీలో



తెలంగాణ మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి బి ఆర్ ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర యూత్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి(బంటి )లు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం మండలం పరిధిలోని తమ సొంత గ్రామం వెలిమినేడు లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. -(దశ, ఇబ్రహీం పట్నం)

# ఓవైసీతో దోస్తీ మంచిది కాదు: టి.రాజాసింగ్

దశ, హైదరాబాద్

ఆస్ట్రేలియా సిడ్నీలోని ఉగ్రవాద కాల్పుల ఘటనకు హైదరాబాద్ కనెక్షన్ ఉండటం కలకలం రేపడమే రాజకీయంగానూ అలజడి రగిలిస్తోంది. ఈ ఘటనపై గోషామహల్ ఎమ్మెల్యే, బీజేపీ మాజీ నేత టి.రాజాసింగ్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదం విషయంలో కఠినంగా వ్యవహరించకుండా బుజ్జగింపు రాజకీయాలు చేసుకుంటూ వెళితే ఇక్కడ కూడా భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు. సిడ్నీలోని బాండి బీచ్ వద్ద హనుక్కా వేడుకల సమయంలో జరిగిన కాల్పుల ఘటనను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

హైదరాబాద్ టోలీచౌకీకి చెందిన వ్యక్తి సాజిద్ అక్రమ్, అతని కుమారుడు నవీద్ కలిసి ఆస్ట్రేలియాలో ఉగ్రదాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీయగా, దీనిపై రాజాసింగ్ ఘాటుగా స్పందించారు. "ప్రపంచంలో ఎక్కడ



ఉగ్రదాడి జరిగినా దాని వెనుక మూలాలు హైదరాబాద్‌తోనే ముడిపడుతున్నాయి. ముఖ్యంగా ఓల్డ్ సిటీ ఉగ్రవాదులకు అడ్డాగా మారింది" అంటూ రాజాసింగ్ నేరుగా ఆరోపణలు చేశారు. "దేశంలో ఎక్కడ అలజడి రేగినా దానికి మూలాలు హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో కనిపిస్తాయి.

టోలీచౌకీలో ఒకప్పుడు నివసించిన వ్యక్తి ఇప్పుడు విదేశాల్లో ఉగ్రదాడి చేశారు. టోలీచౌకి ఓవైసీ పార్లమెంట్ స్థానం"అంటూ రాజాసింగ్ కామెంట్ చేశారుఆస్ట్రేలియాలో జరిగిన ఉగ్రదాడిని తేలకగా తీసుకోవద్దని రాజాసింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. టోలీచౌకి వ్యక్తికి సంబంధం ఉన్నందున అతని బంధువులను విచారణ చేయాలని సూచించారు.

'ఓటుబ్యాంక్, బుజ్జగింపు రాజకీయాలు చేస్తే తెలంగాణ భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని' హెచ్చరించారు ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి కళ్లు తెరవాలని ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇంటెలిజెన్స్ నిఘాను బలపరచాలని సూచించారు. "ఓవైసీతో దోస్తీ ఇవాళ కాకపోతే రేపైనా చేటు చేస్తుంది. దానిని వదిలేయండి. టెర్రరిస్టులతో ఓవైసీకి ఉన్న లింక్ ఇవాళ కాకపోయినా రేపైనా బయటపడుతుంద"ని సీఎం రేవంత్ రెడ్డికి సూచన చేశారు.




## ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 75 పంచాయతీ ఎన్నికల ఫలితాలు
4 లో

దశ
నిజం.. నిర్భయంగా..
02
గురువారం
18-12-2025
WWW.DASHANEWS.COM



## ఒకే కుటుంబంలో ముగ్గురు వార్డు సభ్యులు

*ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తల్లి, కొడుకు, కోడలు*

**దశ, కామేపల్లి:** ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండలం, పొన్నెకల్లు గ్రామంలో ఒకే కుటుంబంలో ముగ్గురు వార్డు సభ్యులు గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తల్లి, కొడుకు, కోడలు వార్డు సభ్యులుగా ఎన్నిక కావడం జరిగింది. కూరాకుల కనకమ్మ (తల్లి),కూరాకుల మల్లేష్ (కొడుకు),కూరాకుల వీర వెంకటలక్ష్మి(కోడలు) ఏకగ్రీవంగా వార్డు సభ్యులు గా ఎన్నికయ్యారు. దీంతో వారిని కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వల్లభనేని అశోక్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు,కామేపల్లి మండల యువజన కాంగ్రెస్ నాయకులు,అభిమానులు,పార్టీ శ్రేణులు,గ్రామస్తులు,బుధవారం అభినందించారు.

# హడ్కో నుంచి 5 వేల కోట్ల రుణం

- ❖ నిలిచిపోయిన పాత బిల్లులను త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ.
- ❖ మార్చి 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను పూర్తి.
- ❖ ప్రస్తుతం 1.48 లక్షల ఇళ్ల పనులు కొనసాగుతుండగా..
- ❖ ఇప్పటికే 60 వేల ఇండ్లు స్లాబ్ దశకు.



**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులను వేగవంతం చేస్తోంది. ఇందుకోసం హడ్కో నుంచి ప్రభుత్వం రూ. 5 వేల కోట్ల రుణాన్ని సమీకరించింది. ఈ నిధులతో నిలిచిపోయిన పాత బిల్లులను త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

వచ్చే మార్చి 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు గ్రీన్ చానెల్ ద్వారా ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్లలోకి డబ్బులు నేరుగా వెళ్లనున్నాయి.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక వనరుల కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుండి రూ. 5 వేల కోట్ల భారీ రుణాన్ని తీసుకుంది. ఈ నిధుల రాకతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల బిల్లులను త్వరలోనే వారి వారి ఖాతాల్లో జమ చేసేందుకు హౌసింగ్ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. బేస్మెంట్, స్లాబ్ మరియు ఫినిషింగ్ వంటి వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం ప్రతీ సోమవారం గ్రీన్ చానెల్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పంపిణీ చేయనుంది. నిధుల లభ్యత పెరగడంతో.. క్షేత్రస్థాయిలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని కలెక్టర్లు , ప్రాజెక్టు డైరెక్టర్లకు ఆదేశాలు అందాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు.. అంటే మార్చి 31 నాటికి లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.48 లక్షల ఇళ్ల పనులు కొనసాగుతుండగా.. ఇప్పటికే 60 వేల ఇండ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయి. హౌసింగ్ సెక్రటరీ, కార్పొరేషన్ అధికారులు నిత్యం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లతో సమావేశాలు నిర్వహిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు.ప్రభుత్వం ఈ పథకానికి బడ్జెట్‌లో రూ. 12 వేల కోట్లు కేటాయించింది.

హడ్కో లోన్ , భూముల వేలం ద్వారా వచ్చిన నిధులతో కలిపి ఈ మార్చి లోపు రికార్డు స్థాయిలో ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం, పెండింగ్ బిల్లుల విడుదల వార్త ఇప్పుడు లబ్ధిదారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

## టోఫెల్ ఐబీటీ లో సంస్కరణలు




**దశ, హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్ భాషా నైపుణ్యాన్ని న్యాయపరంగా, సులభంగా, తగిన ప్రమాణాలతో పెంపొందించే క్రమంలో టోఫెల్ ఐబీటీ పరీక్షలో దశలవారీగా సంస్కరణలు ప్రవేశపెట్టనున్నట్లు అంతర్జాతీయ ఈటీఎస్ (ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్) సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ని రోడ్రిగస్ డిసౌజ వెల్లడించారు. హైదరాబాద్ బేగంపేటలోని విలేకరులతో ఆయన మాట్లాడుతూ... 'తాజాగా టోఫెల్ ఐబీటీ పరీక్ష విధానంలో మార్పులు చేశారు. ఇకపై పరీక్ష ఫలితాలు 72 గంటల్లోనే అందుబాటులోకి రానున్నాయి. ఇంటి నుంచే పరీక్ష రాసే అభ్యర్థులకు మరింత భద్రత, సహకార వాతావరణం కల్పించేలా ఈటీఎస్ ద్వారా శిక్షణ పొందిన ఇన్విజిలేటర్లు, ఏఐ ఆధారిత గుర్తింపు నిర్ధారణ విధానాన్ని అమలు చేయనున్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి చదవడం, వినడం వంటి విభాగాల్లో మల్టీస్టేజ్ ఎడాప్టివ్ టెస్టింగ్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. అభ్యర్థి ప్రతిభ ఆధారంగా ప్రశ్నల కఠినత మారే విధానం, వాస్తవ అకడమిక్ ఇంగ్లిష్ వినియోగాన్ని తప్పనిసరి చేయనున్నారు. పరీక్ష స్కోర్, రిపోర్టింగ్లోనూ మార్పులు చోటు చేసుకోనున్నాయి. ప్రస్తుతం ఉన్న 0120 స్కేల్తోపాటు సీఈఎస్ఆర్ ప్రమాణాలకు అనుగుణంగా 16 బ్యాండ్ స్కేల్నుకూడా ప్రవేశపెట్టనున్నారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా విద్యాసంస్థలు, విద్యార్థులు, టోఫెల్ స్కోర్లను సులభంగా అర్థం చేసుకోవచ్చు' అని ఆయన తెలిపారు.

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని పడేయలేదు



**దశ, హైదరాబాద్:** తెలంగాణ తల్లి విగ్రహాన్ని కింద పడేశారు అనేది తప్పుడు ప్రచారమని రోడ్లు భవనాలు శాఖ వివరణ ఇచ్చింది. భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ వేదికగా అన్ని జిల్లాల కలెక్టరేట్లో ముఖ్యమంత్రి శ్రీ ఏ.రేవంత్ రెడ్డి గారు వర్చువల్ గా తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఆ సందర్భంలో 12 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖ తరుపున తాత్కాలికంగా ఏర్పాటు చేసింది. భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ కోసం వేసిన తాత్కాలిక నిర్మాణాలు తొలగిస్తున్న నేపథ్యంతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అక్కడి నుండి తరలించే ప్రక్రియలో భాగంగా విగ్రహానికి ఎలాంటి డ్యామేజ్ జరగకుండా భద్రంగా పక్కకు వాల్చి క్లాత్ ర్యాపింగ్ చేశాం. విగ్రహాన్ని పక్కకు వాల్చిన సందర్భంలో ఎవరో దురుద్దేశపూర్వకంగా తీసిన ఫో టోలు సోషల్ మీడియాలో పెట్టి దుష్ప్రచారం చేస్తూ యావత్ తెలంగాణ సమాజాన్ని తప్పు దోవ పట్టిస్తు,రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి ఎలాంటి అగౌరవం జరగలేదు. భద్రంగా ర్యాపింగ్ చేసి గుడిమల్కాపూర్ ఇండస్ట్రియల్ వర్క్ షాప్ కు తరలించామని రోడ్లు భవనాలు శాఖ వివరణ ఇచ్చింది.



## వృద్ధురాలిని మోసుకెళ్లి ఓటు వేయించిన పోలీస్

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం, గ్రామపంచాయతీ ఎన్నికల్లో మండలం భోజెరువు గ్రామంలో జరిగిన పోలింగ్ సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓ వృద్ధ మహిళ నడవలేని స్థితిలో ఉండటాన్ని గమనించిన హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ వృద్ధ మహిళను తన చేతులపై మోసుకొని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేసేలా సహకరించారు. ఎన్నికల విధుల్లో భద్రత నిర్వహణతో పాటు ప్రజాసేవే ముఖ్యమని మరోసారి నిరూపించిన ఈ ఘటన స్థానికుల మనసులను కదిలించింది.

# మూడో విడత పోలింగ్ ప్రశాంతం

❖ *కలెక్టర్ జితేష్ పాటిల్*



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనల మేరకు భద్రాద్రి జిల్లాలో బుధవారం నిర్వహించిన మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన విస్తృత ఏర్పాట్లు, భద్రతా చర్యల కారణంగా పోలింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

ఈ మూడో విడత ఎన్నికలలో భాగంగా జిల్లాలోని అల్లపల్లి, గుండాల, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, సుజాతానగర్, టేకులపల్లి, యెల్లందు మండలాలలో పోలింగ్ నిర్వహించబడింది. జిల్లాలో మొత్తం 1,75,074 మంది ఓటర్లు నమోదు కాగా, పోలింగ్ ముగిసే సమయానికి 1,48,230 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లాలో మొత్తం 84.67 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్ ప్రారంభమైన ఉదయం నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు హాజరయ్యారని తెలిపారు. ఉదయం 9.00 గంటల వరకు జిల్లావ్యాప్తంగా 37,231 ఓట్లు పోలవగా ఇది 21.27 శాతం పోలింగ్‌గా నమోదైందని, ఉదయం 11.00 గంటల వరకు 1,09,155 ఓట్లు పోలై 62.35 శాతం పోలింగ్ నమోదైందని చెప్పారు. మధ్యాహ్నం 1.00 గంటల వరకు మొత్తం 1,41,176 ఓట్లు పోలై 80.64 శాతం పోలింగ్ నమోదు కాగా, క్లోజ్ ఆఫ్ పోలింగ్ సమయానికి మొత్తం 1,48,230 ఓట్లు పోలై 84.67 శాతం పోలింగ్‌తో ఎన్నికలు ముగిశాయని కలెక్టర్ వివరించారు. మండలాల వారీగా పోలింగ్ శాతం పరిశీలిస్తే అల్లపల్లి మండలంలో 88.09 శాతం, గుండాల మండలంలో 86.25 శాతం, జూలూరుపాడు మండలంలో 88.71 శాతం, లక్ష్మీదేవిపల్లి మండలంలో 80.86 శాతం, సుజాతానగర్ మండలంలో 89.32 శాతం, టేకులపల్లి మండలంలో 86.47 శాతం, యెల్లందు మండలంలో 80.65 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సామగ్రి బ్యాలెట్ పేపర్లను అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్యగా సంబంధిత కౌంటింగ్ కేంద్రాలకు తరలించామని ప్రస్తుతం కౌంటింగ్ ప్రక్రియ పోలీసు శాఖ ఎన్నికల అధికారుల సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు మధ్య సజావుగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఉపయోగించిన ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పేపర్లు, సంబంధిత రికార్డులు అన్నింటినీ నిబంధనల ప్రకారం సీల్ చేసి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశించారు.

## హైదరాబాద్ జంట కమిషనరేట్ల సమావేశంలో కీలక నిర్ణయాలు

**దశ, హైదరాబాద్:** సికింద్రాబాద్ జంట నగరాల్లో శాంతి భద్రతలు, ట్రాఫిక్ వంటి కీలక అంశాల్లో కమిషనరేట్లు కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నాయి. బుధవారం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నేరం ఎక్కడ జరిగినా జంట కమిషనరేట్ల పరిధిలో స్పందించాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణకు అంతటా ఒకే రూల్ ఉండాలని నిర్ణయించుకున్నారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల పట్ల ఉమ్మడి కార్యాచరణ గురించి చర్చించుకున్నారు. అలాగే హైదరాబాద్ వచ్చే భారీ వాహనాల నో ఎంట్రీకి ఒకే సమయాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇక, జంట నగరాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ ఒకేసారి చేపట్టాలని, సరిహద్దు కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయంలో కమ్యూనికేషన్ సజావుగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

# డ్రోన్ ద్వారా తక్కువ ఖర్చుతో లాభదాయక వరి సాగు



❖ *జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ ద్వారా విత్తనాలు మందులు పిచికారి చేయడంతో లాభదాయకమైన వరి సాగు చేయవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామంలో డ్రోన్ సాంకేతికత ద్వారా నేరుగా వరి విత్తనాలు వెదజల్లే ప్రక్రియను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే తక్కువ ఖర్చుతో లాభదాయకంగా వరి సాగు చేయవచ్చని తెలిపారు. డ్రోన్ ద్వారా వరి విత్తనాలను నేరుగా వెదజల్లడం, అలాగే గడ్డి మందులు పురుగుమందులను పిచికారీ చేయడం ద్వారా కూలీ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. అదేవిధంగా సమయం ఆదా కావడంతో పాటు పంట స్థాపన సమానంగా జరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయన అన్నారు. రైతులు ఈ విధమైన ఆధునిక పద్ధతులను స్వీకరించి వ్యవసాయంలో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వెదజల్లే విధానంలో సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే తక్కువ విత్తనాలు సరిపోతాయని దీంతో విత్తన వ్యయం తగ్గుతుందని వివరించారు. ఈ విధానం ద్వారా సాగు ఖర్చులు కూడా గణనీయంగా తగ్గడంతో పాటు రైతులకు అధిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వెదజల్లే ప్రత్యక్ష ప్రదర్శనను వీక్షించి ఈ ఆధునిక సాంకేతికత ప్రయోజనాలపై అవగాహన పొందారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రోన్ వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం రైతుల్లో ఆధునిక సాంకేతికతపై నమ్మకాన్ని పెంచి, తక్కువ ఖర్చుతో లాభదాయకమైన వరి సాగుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. శరత్ చంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ, ఏడిఏ తాతారావు, శంకర్, సోంపల్లి గ్రామానికి చెందిన అధికారులు సిబ్బంది అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్సీ పోచంపల్లి

**దశ, మహబూబాబాద్ :** మహబూబాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి తండ్రి శేషా రెడ్డి ఇటీవల మరణించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో వారి దశదినకర్మ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీఆరెస్ నేత, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై శేషారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మెన్ ను పరామర్శించి అధైర్యపడవద్దంటు ఓదార్చారు.

# కొత్తగూడెం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా డాక్టర్ బిఎస్ రావు ఏకగ్రీవ ఎన్నిక



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా కొత్తగూడెంకు చెందిన ప్రముఖ ఈఎన్టీ వైద్యులు డాక్టర్ బిఎస్ రావును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులతోపాటు తోటి డాక్టర్లు కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇందుకు సంబంధించిన ప్రకటనను డాక్టర్ బిఎస్.రావు బుధవారం విడుదల చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ బిఎస్ రావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో సభ్యులంతా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎన్నుకున్నందుకు బాధ్యతగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు నిరుపేద ప్రజలకు ప్రైవేటు వైద్యం కూడా తక్కువ ఖరీదుతో నాణ్యమైన వైద్యం అందించడానికి నిజాయితీగా కృషి చేస్తానని ఈ సందర్భంగా డాక్టర్ బిఎస్ రావు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా డాక్టర్ బిఎస్.రావు కొత్తగూడెం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల కొత్తగూడెం పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు వ్యాపారస్తులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థ సభ్యులు అభినందనలు తెలిపారు.

దశ
నిజం.. నిర్భయంగా..

03
గురువారం
18-12-2025
WWW.DASHANEWS.COM

## పోలింగ్ సరళిని పరిశీలించిన ఎస్పీ



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి జిల్లా పరిధిలోని మండలాల్లో బుధవారం జరిగిన పంచాయతీ ఎన్నికలలో నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. జిల్లాలో పంచాయితీ ఎన్నికల మూడో విడత పోలింగ్ లో భాగంగా జూలూరుపాడు మండలం పాపకొల్లు,సుజాతనగర్ మండలం సర్వారం, లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ, టేకులపల్లి, దాసుతండా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ విధులలో ఉన్న పోలింగ్ అధికారులు పోలీస్ అధికారులు సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులంతా అప్రమత్తతో పనిచేయాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన క్రింద కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అధికారులంతా బాధ్యతగా తమ విధులను నిర్వర్తించాలని తెలిపారు.

# ధనుర్మాసంలో హరిదాసులే సంస్కృతి సారధులు



**దశ సూర్యాపేట ప్రతినిధి :** ధనుర్మాసం మొదలైన దగ్గర్నుంచే తెలుగు లోగిళ్లలో పండగ వాతావరణం మొదలవుతుంది. ఇంటిముందు ముగ్గులు, హరిదాసులు, బుడబుక్కలవారు, గంగిరెద్దులవాళ్లతో గ్రామాల్లో పండుగ వాతావరణం వస్తుంది.లేలేత సూర్యకిరణాలు భూమిని తాకే వేళ, ఇంటి ముందు మహిళలు ముగ్గులు పెట్టేవేళ, రామదాసు కీర్తనలు, హరినామ సంకీర్తన,శ్రీ కృష్ణ లీలామృతాన్ని గానం చేసుకుంటూ...

కాలికి గజ్జెకట్టి తంబుర మీటుతూ, తలపై అక్షయ పాత్రతో చేతిలో చిడతలతో హరిదాసులు చేసే సంకీర్తనలు ధనుర్మాసం వేళ కనిపించే అతి గొప్ప సాంప్ర దాయాల్లో ఒకటి గా చెప్పవచ్చును.


సంక్రాంతి ముందు మాత్రమే హరిదాసులు కనపడతారు మళ్ళీ సంవత్సరం దాకా రారు, హరిదాసు అంటే పరమాత్మతో సమానం.శ్రీ మహావిష్ణువుకు ప్రతినిధులు హరిదాసులు హరిదాసుల అక్షయపాత్రలో బియ్యం పోస్తే మనం తెలిసి తెలియక చేసిన ఎన్నో పాపలు తొలగిపోతాయి.

మనుషులు ఇచ్చే దానధర్మాలు అందుకొని వారికి ఆయురారోగ్యాలు భోగభాగ్యాలు కలగాలని దీవించేవారు హరిదాసులు. ధనుర్మాసం నెలరోజుల పాటు హరినామన్ని గానం చేసినందుకు చివరి రోజున స్వయం పాకానికి అందరూ ఇచ్చే ధన, ధాన్య, వస్తు దానాలను స్వీకరిస్తారు.

సూర్యభగవానుడు ప్రసాదించిన అక్షయ పాత్రగా వారి శిరస్సుపై పంచలోహ పాత్రను ధరిస్తారు. ధనుర్మాసం నెలరోజులు సూర్యోదయానికి ముందే శ్రీకృష్ణ గోదాదేవిని స్మరించి, తిరుప్పావై పఠించి, అక్షయ పాత్రను ధరించి హరిదాసులు గ్రామ సంచారం ప్రారంభిస్తారు. శ్రీకృష్ణునికి మరోరూపం హరిదాసులని అంటారు పెద్దలు. గొబ్బెమ్మలను ఇంటి ముందు చక్కగా అలంకరించి, హరినామ స్మరణ చేసే వారిని అను గ్రహించడానికి హరిదాసు రూపంలో వైకుంఠపురం నుండి శ్రీమహావిష్ణువు వస్తాడన్నది ఒక నమ్మకం. హరిదాసు అనగా పరమాత్మతో సమానం మనుషులు ఇచ్చే ధానధార్మలు అందుకొని వారికి ఆయురారోగ్యాలు భోగభాగ్యలు కలగాలని దీవించేవారు హరిదాసులు.

నెలరోజుల పాటు హరినామన్ని గానం చేసినందుకు చివరి రోజున స్వయంపాకానికి అందరూ ఇచ్చే ధన, ధాన్య, వస్తు దానాలను స్వీకరిస్తారు. ఇంటికి తిరిగి వెళ్లే వరకు హరినామ సంకీర్తన తప్ప మరేమి మాట్లాడరు. అక్షయపాత్రను దించరు. ఇంటికి వెళ్ళాక అతని ఇల్లాలు ఆ హరిదాసు పాదాలు కడిగి, అక్షయపాత్రను దించుతుంది. హరిదాసు పేద, ధనిక భేదం లేకుండా అందరి ఇంటికి వెళ్తాడు. ఎవరి ఇంటి ముందు ఆగడు. శ్రీమద్రమా రమణ గోవిందో హరీ అంటూ.. ఇంటి ముందు ముగ్గు చుట్టూ ఒకసారి తిరుగుతాడు. గుమ్మంలో ఎవరూ లేకపోతే మరో ఇంటికి వెళ్తాడు.

హరిదాసు ఉట్టి చేతులతో వెళ్ళిపోతే ఆ ఇంటికి అరిష్టమంటారు పెద్దలు. అందుకే గ్రామాలలో హరిదాసుడు వస్తున్నాడంటే ఇంటి యజమానులు గుమ్మాలలో ధాన్యంతో సిద్ధంగా ఉంటారు . అక్షయపాత్రలో బియ్యం పోయడాన్ని ఆ శ్రీమహా విష్ణువుకు కానుకలు బహూకరించినట్లుగా భక్తులు భావిస్తారు. హరిదాసు తలమీద గుండ్రటి రాగిపాత్రను భూమికి సంకేతంగా శ్రీమహావిష్ణువు పెట్టాడనే ప్రచారంలో ఉంది. హరిదాసు వస్తే ఎన్ని పనులు ఉన్నా ఇంటి ముందుకు వచ్చి అక్షయ పాత్రలో బియ్యం పోయండి. ఏడాదిలో ఎప్పడూ కనపడని హరిదాసులు ధనుర్మాసం మొదలు నుంచి సంక్రాంతి వరకు ఈ నెల రోజులు మాత్రమే కనిపిస్తారు. గ్రామాల్లో హరిదాసులు సందడి సూర్యోదయంతోటే మొదలవు తుంది. ఇలా నెలరోజులుగా తిరిగి సంవత్సరానికి సరిపడ గ్రాసాన్ని హరిదాసులు సంపాదించు కుంటారు. వీరంతా బయట వూరినుంచే వస్తారు. ఏడాదిలో ప్రతి వూరికీ ఎవరెవరు వస్తారో వారు తప్పా ఇతరులు రారు. ముఖ్యంగా ఇలా వచ్చే వారిలో విష్ణు భక్తులైన సాతానులు, దాసరులు, రాజులు మొదలైన వారు ఇలా జీవిస్తూ వుంటారు.



గ్రామ వీధుల్లో హరి దాసులుఇలా హరి భజన చేయడం కోలాహలంగా వుంటుంది. హరి దాసుని అక్షయ పాత్రలోబియ్యం వేయటానికి..బాలబాలికలు పోటీలు పడతారు.హరిదాసులు ప్రతి ఇంటి ముందూ కూర్చుని లేవటం చాల కష్టమైన పని, అయినా భక్తిభావంలో అదంతా మరిచిపోతారు. హరిదాసులతో పాటు, ఈ పర్వదినాలలో, గంగి రెద్దుల వారు, బుడబుక్కలవారు, పగటి వేషధారులు, గారడీ వాళ్ళు, ఎందరెందరో జానపద కళాకారులతో, కన్నుల పండుగగా సంక్రాంతి పర్వ దినాలతో ముగుస్తాయి. పంటను ఇంటికి తెచ్చుకుని కళకళ లాడే రైతు కుంటుంబాలు సంక్రాంతి సంతోషంలో అందరినీ ఆదరిస్తారు. మన ఆచారాలును, సంస్కృతిని కాపాడుకుంటే మన ధర్మాన్ని మనం కాపాడుకున్నట్లే.

## వినియోగదారుల మన్నలను పొందాలి


❖ *వెంకటాద్రి జువెల్లెర్స్ షోరూంని ప్రారంభించిన బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు అంతటి విజయ్*



**దశ, సూర్యాపేట:** వినియోగదారులకు నాణ్యమైన బంగారాన్ని అందించి వారి మన్ననలను పొందాలని సూర్యాపేట బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయకుమార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పూల సెంటర్ లో శ్రీ వెంకటాద్రి జ్యువెలరీ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. గత 15 సంవత్సరాల నుండి ఈ వ్యాపారంలో వినియోగదారులకు సర్వీస్ అందిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో బంగారం వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు మామిడి నాగ వెంకట హరీష్ కుష్మిత మాట్లాడుతూ. మా కస్టమర్లకు ఎప్పటికప్పుడు నూతన మోడల్స్, నాణ్యత, మన్నికతో బంగారు, ఆభరణాలను అందిస్తామని తెలిపారు. బంగారు షాపు ఓపెనింగ్ కి వచ్చిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సింహాద్రి, ట్రెజరర్ బూర్లే మధు, మామిడి శ్రీనివాస్, రాచకొండ శ్రీనివాస్, వెంకట రవితేజ, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు

❖ *సైబర్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ సాయి శ్రీ*



**దశ, వరంగల్:** అపరిచిత వ్యక్తులతో గానీ, సామాజిక మాధ్యమాల ద్వారా గానీ తమ వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ సాయి శ్రీ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు సూచించారు. "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ వరంగల్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ సాయి శ్రీ మాట్లాడుతూ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ డైరెక్టర్ షికా గోయల్ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. డిజిటల్ అరెస్టులు, లోన్ యాప్ మోసాలు, పెట్టుబడి మోసాలు, మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్, ట్రేడింగ్ యాప్స్ ద్వారా జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని, అలాగే www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

# పంచాయతీ ఎన్నికలతో గులాబీ జోష్..

❖ *బీఆర్ఎస్ పార్టీ గట్టి పోటీ .*
❖ *బీఆర్ఎస్ గ్రామాల్లో పట్టు కోల్పోలేదని రుజువు.*



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు ముగింపు కు వచ్చాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించింది. బీఆర్ఎస్ పార్టీ కూడా మంచి పోటీ ఇచ్చింది. గ్రామాల్లో పట్టు కోల్పోలేదని రుజువైంది. బీజేపీ ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. ఇప్పుడు ఇదే జోష్‌ను జెడ్పీటీసీ ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల వరకు తీసుకెళ్లేందుకు వ్యూహాలు రచించే పనిలో ఉన్నారు గులాబీ అధినేత. అందుకే పార్టీ ఎల్పీతోపాటు పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. డిసెంబర్ 21న తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం భేటీ జరగనుంది. ఇందులో కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

2023 ఎన్నికల్లో పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తుందని గులాబీ దళం చాలా గట్టిగా ఆశలు పెట్టుకుంది. కానీ ప్రజలకు మాత్రం కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపారు. దీంతో బీఆర్ఎస్ వర్గాలు ఒక్కసారిగా ఢీలాపడిపోయాయి. దీనికి తోడు అప్పటి నుంచి కేసీఆర్ ఒకట్రెండు పార్టీ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క భారీ రాజకీయ నిర్ణయాలు తీసుకోలేదు. అప్పుడప్పుడు నిరసనలకు పిలుపునిచ్చినా అవి అంతగా ప్రభావం చూపలేదు.

కవిత తిరుగుబాటుతో పార్టీ మరింత పలుచనైంది. కేటీఆర్, హరీష్ ఇద్దరే పార్టీ కొందరు సీనియర్స్‌తో కలిసి వచ్చిన ఎన్నికలను ఎదుర్కొంటున్నారు. పంచాయితీ ఎన్నికలు మినహా ఏ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ తమ స్థాయిలో రాణించలేకపోయింది. బీఆర్ఎస్ పరిస్థితి చూసిన వారంతా బీజేపీ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని చూశారు. కానీ ఆ పార్టీ కూడా అంతర్గత కుమ్ములాటలతో రెండు అడుగులు ముందుగు ఆరు అడుగులు వెనక్కి వెళ్తోంది. దీంతో ప్రజల మనసు మారినట్టు కనిపిస్తోంది. అందుకే పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ తర్వాత స్థానం బీఆర్ఎస్‌కు కట్టబెట్టారు.

పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు నమ్మకం ఉంచి గెలిపించారని దాన్ని ముందుకు కొనసాగించాలని సూచించనున్నారు. తెలంగాణ భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. ఇందులో భవిష్యత్‌లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలతోపాటు పోరాటాలపై కూడా ఫోకస్ చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించనున్నారు. ముఖ్యంగా తెలంగాణకు అన్యాయం చేసేలా పొరుగు రాష్ట్రాలు నీటిని తరలించుకుపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఇన్ని రోజులు కాంగ్రెస్ ప్రభుత్వానికి టైం ఇచ్చామని ఇప్పుడు తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన టైం వచ్చిందని అందుకే తానే క్షేత్రస్థాయిలోకి దిగబోతున్నట్టు కేసీఆర్ చెప్పనున్నారని తెలుస్తోంది

## మున్నూరు కాపు భవన నిర్మాణ పనులు



❖ *పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి*

**దశ, వరంగల్:** ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదట రూ.5 కోట్లుగా ఉన్న భవన నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.7 కోట్లకు రీఎస్టిమేట్ చేయించి, శంకుస్థాపనతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఈ ఆత్మగౌరవ భవనం ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరు కాపు సోదరులకు ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భవన నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్తుండటంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఉమ్మడి జిల్లా మున్నూరు కాపు సంఘం తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు మానస రామప్రసాద్, విజయలక్ష్మి సురేందర్‌తో పాటు మున్నూరు కాపు పెద్దలు మంద ఐలయ్య, కటకం పెంటయ్య, గైనేని రాజన్, కోరబోయిన సాంబయ్య, తోట వెంకన్న, దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, వేల్పుల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సేవలు అమూల్యం

❖ *ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి*




**దశ, కాజీపేట :** పెన్షనర్ డే సందర్భంగా కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేసిన పెన్షనర్ల సేవలు అమూల్యమని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో నిబద్ధతతో విధులు నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగుల కృషి వల్లే నేడు వ్యవస్థలు బలంగా నిలబడ్డాయని పేర్కొన్నారు. రిటైర్మెంట్ అనంతరం కూడా సమాజానికి మార్గనిర్దేశకులుగా పెన్షనర్లు కొనసాగడం యువతకు ఎంతో ప్రేరణనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ పెన్షనర్లను ఎమ్మెల్యే సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించిన ఆయన, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయ శ్రీ రజాలి, డివిజన్ అధ్యక్షులు అజ్గర్, నాయకులు గుంటి కుమార్, సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, మధు, సమ్మయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..

04
గురువారం
18-12-2025
WWW.
DASHANEWS
.COM



## పార్టీ ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి ముప్పు

**దశ, రాజేంద్రనగర్:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని బి.ఆర్.ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోల్లా కార్తీక్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అధికార పార్టీకి అనుకూలంగా స్పీకర్ వ్యవహరిస్తూ రాజ్యాంగ పరమైన బాధ్యతలను విస్మరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలు తమ ఓటును పార్టీ సిద్ధాంతాలు, విధానాల ఆధారంగా వేస్తారని, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పార్టీ ఫిరాయించడం ప్రజల తీర్పును తుంగలో తొక్కినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విధమైన పార్టీ మార్పులు కొనసాగితే ప్రజలకు రాజకీయ వ్యవస్థపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉందని, పార్టీ ఫిరాయింపులను బి.ఆర్.ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం బి.ఆర్.ఎస్ పార్టీ అన్ని స్థాయిల్లో పోరాటం చేస్తుందని కార్తీక్ రెడ్డి తెలిపారు.

# అమరావతి వర్సెస్ ఫ్యూచర్ సిటీ

- తమ డ్రీం ప్రాజెక్టులను సాకరం చేసే పనిలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు
- ఫ్యూచర్ సిటీ పేరుతో మరో కొత్త నగరాన్ని సృష్టించే పనిలో రేవంత్
- రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్మించే ప్రయత్నంలో చంద్రబాబు



**దశ, హైదరాబాద్:** ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలు చెరో క్రొత్త నగరాన్ని నిర్మించే పనిలో ఉన్నాయి. ఏపీ ముఖ్యమంత్రి రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్మించే ప్రయత్నం గత ఆరేళ్లు గా చేస్తూనే ఉన్నారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాదును అనుకునే మరో నగరాన్ని సృష్టించడం కోసం చాలా కష్టపడుతున్నారు. ఒకప్పుడు ఒకే పార్టీలో ఉన్న ఈ ఇద్దరు ముఖ్యమంత్రులు తమ తమ డ్రీం ప్రాజెక్టులను సాకరం చేసే పనిలో పడ్డారు.

రాజకీయంగా తెలంగాణ సీయం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యర్థులు పదేపదే తెలంగాణ మూవ్ మెంట్ సమయంలో ఆయన పాత్ర పై ప్రశ్నలు సంధిస్తూ ఉంటారు. వాటికి చెక్ పెట్టేందుకు తనదైన బ్రాండ్ ను ప్రమోట్ చేసేందుకు ఫ్యూచర్ సిటీ పేరుతో మరో కొత్త నగరాన్ని సృష్టించే పనిలో రేవంత్ పడ్డారు. హైదరాబాదును ఆదుకుహైదరాబాదును అనుకుని నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రమోషన్స్ కోసం ఇటీవల ఆయన ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ సమిట్ టాక్ అఫ్ ది స్టేట్ అయింది. ముందుగా ఫ్యూచర్ సిటీ కోసం 30 వేల ఎకరాల్లో దీన్ని నిర్మిస్తుండగా భవిష్యత్ లో దాదాపు లక్షా ఎనభై వేలకు పైగా ఎకరాల్లో విస్తరించే ఆలోచనలో ఉన్నారు.

భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో నిర్మిస్తున్న ఈ నగరం ఔటర్ రింగ్ రోడ్, శ్రీశైలం రోడ్డు, నాగర్జున సాగర్ రోడ్ ల మధ్య శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు ఒక 30 కిమీ దూరం లో రానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు కు సైబర్ సిటీ, వైఎస్ ఆర్ కు ఔటర్ రింగ్ రోడ్ నిర్మాతలుగా పేరు ఉంది. ఇప్పుడు ఫ్యూచర్ సిటీ నిర్మాత గా గా తన పేరు ఉండాలని తెలంగాణ ప్రస్తుత సీయం రేవంత్ రెడ్డి ట్రై చేస్తున్నారు. ఈ సిటీ లో ఫార్మా, AI, ఎంటర్టైన్మెంట్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, హెల్త్ రంగాలను ప్రోత్సహించేలా 6 థీమ్ సిటీలను నిర్మించే ప్లాన్ చేశారు రేవంత్. ఇప్పటికే ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించే పనిలో పడింది తెలంగాణ ప్రభుత్వం.కనీసం 10 లక్షల మంది నివసించేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోంది.

తెలంగాణ ప్రభుత్వానికి పెట్టుబడుల ఆకర్షణ పెద్ద కష్టం కాదు. హైదరాబాద్ పేరుతో ఆల్రెడీ ఎస్టాబ్లిష్ అయిన ప్రపంచ స్థాయి సిటీ వారికీ అండగా ఉంది. కేంద్రంపై మరీ ఎక్కువ గా ఆధార పడాల్సిన అవసరం రేవంత్ కు లేదు. ఈ క్రొత్త సిటీ నిర్మాణ పర్యవేక్షణ కు ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ ఆధారిటీ ని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఫ్యూచర్ సిటీ ని తెలంగాణ లోని అన్ని ప్రాంతాలతో డైరెక్ట్ గా కనెక్ట్ చేసే రోడ్లు రెడీ చేస్తున్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ని అమరావతి మీదుగా మచిలీపట్నం పోర్ట్ తో లింక్ చేసే గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కు కూడా ప్రయత్నాలు కొలిక్కి వస్తున్నాయి.

2028 ఎన్నికల టార్గెట్ గా ఫ్యూచర్ సిటీ తొలి దశ పూర్తి చేసే పనుల్లో సీయం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారు. కేంద్రం నుండి కూడా పూర్తి స్థాయిలో అమరావతి కి సాయం అందుతుందా అంటే లేదనే చెప్పాలి. ఇచ్చేదంతా అప్పుగానే ఇస్తున్నారు. పైగా ఏపీ కి రెవెన్యూ పరం గా అండగా నిలబడే హైదరాబాద్ లాంటి నగరం లేదు. అయినప్పటికీ చంద్రబాబు మొండిగా అమరావతి కోసం పోరాడుతున్నారు. ఏదేమైనా 2029 ఎన్నికలకు ముందుగానే అమరావతి కి ఒక రూపం తేవాల్సిన అవసరం పొలిటికల్ గా చంద్రబాబు పై ఉంది. ప్రస్తుతానికి అయితే ఒక మేర రేవంత్ ఫ్యూచర్ సిటీ పనులు కాస్త స్పీడ్ గా జరుగుతున్నట్టు కనిపిస్తున్నా చంద్రబాబు కూడా ప్రతికూల పరిస్థితుల్లోనూ తాను అనుకున్నది సాధించి తీరతారని ఆయన అభిమానులు కూటమి నేతలు అంటున్నారు

## ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 75 పంచాయతీ ఎన్నికల ఫలితాలు




**దశ, రంగారెడ్డి**

### ఇబ్రహీంపట్నం మండలం

1.కర్ణంగూడ: కాంగ్రెస్
2.ముకునూర్: కాంగ్రెస్
3.దండుమైలారం: కాంగ్రెస్
4.ఉప్పరిగూడ: బిఆర్ఎస్
5.చర్లపటేల్ గూడ: బిఆర్ఎస్
6.తుర్కగూడ: బిఆర్ఎస్
7.తులేకాలన్: బిఆర్ఎస్
8.రాయపోల్: బిఆర్ఎస్
9.కప్పడ్: బిఆర్ఎస్
10.పోచారం: కాంగ్రెస్
11.నాగన్ పల్లి: కాంగ్రెస్
12.పోల్కంపల్లి: కాంగ్రెస్
13. నేర్రపల్లి: బీజేపీ
14. ఎలిమినేడు: బిఆర్ఎస్

### మంచాల మండలం

లింగంపల్లి: కాంగ్రెస్
మంచాల: కాంగ్రెస్
చిదేడ్: కాంగ్రెస్
బొడకొండ: బిఆర్ఎస్
నోముల: బిఆర్ఎస్
దాద్ పల్లి: బిఆర్ఎస్
లోయపల్లి: బిఆర్ఎస్
కాగజ్ ఘాట్: కాంగ్రెస్
బండలేమురు: బిఆర్ఎస్
సత్తితండా: కాంగ్రెస్
ఆరుట్ల: బిఆర్ఎస్
తాళ్లగూడా: బీజేపీ

### యాచారం మండలం


1.నందివనపర్తి: బీజేపీ
2.చింతపట్ల: బిఆర్ఎస్ (1205)మెజార్టీ
3.అయ్యావారి గూడం: బిఆర్ఎస్
4.నాజ్దిక్ సింగారం: బిఆర్ఎస్
5.తాడిపర్తి: బిఆర్ఎస్
6.గున్ గల్: కాంగ్రెస్
7.యాచారం: కాంగ్రెస్
8.మంథని గౌరెల్లి: కాంగ్రెస్
9.కొత్త పల్లి: కాంగ్రెస్
10.మల్కిజ్ గూడా: బిఆర్ఎస్
11.చింతుళ్ళ: బిఆర్ఎస్
12.మొండిగౌరెల్లి: బిఆర్ఎస్
13.గడ్డమల్లయ్యగూడా: ఇండిపెండెంట్
14.KC తండా: బిఆర్ఎస్

### అబ్దుల్లాపూర్మెట్ మండలం

లాష్కర్ గూడా: కాంగ్రెస్
బలిజగూడా: బీజేపీ
అబ్దుల్లాపూర్ మెట్: కాంగ్రెస్
కవాడిపల్లి: బీజేపీ
అనాజ్ పూర్: బిఆర్ఎస్
గుంతపల్లి: బిఆర్ఎస్
మజీద్ పూర్: OPDR
బాటసింగారం: బిఆర్ఎస్
ఫిగ్లీపూర్: కాంగ్రెస్ (ఏకగ్రీవం)
బండరావిరాల: బిఆర్ఎస్
చిన్నరావిరాల: కాంగ్రెస్
ఇనంగూడా: బిఆర్ఎస్
గండిచెరువు: కాంగ్రెస్
జఫర్ గూడా: కాంగ్రెస్

- నూతన సర్పంచుల బాధ్యతల స్వీకరణ వాయిదా
- పదవీ బాధ్యతల స్వీకరణ డిసెంబర్ 20 నుంచి 22వ తేదీకి వాయిదా
- డిసెంబర్ 20న సరైన ముహూర్తాలు లేవని ప్రజాప్రతినిధుల
- విజ్ఞప్తి మేరకు పంచాయతీరాజ్ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం
- రాష్ట్రవ్యాప్తంగా నూతన సర్పంచులందరూ
- డిసెంబర్ 22నే అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు

## అభ్యంతరాల సమర్పణ గడువు మరో రెండు రోజులు



**దశ, హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. డిసెంబర్ 17తో ముగిసే అభ్యంతరాల సమర్పణ గడువును మరో రెండు రోజులు (డిసెంబర్ 19 వరకు) పొడిగిస్తూ కోర్టు ఆదేశించింది. పిటిషనర్ల న్యాయవాదులు మూడు రోజులు పొడిగించాలని కోరగా, డెడ్‌లైన్ దగ్గరపడటంతో రెండు రోజులు సరిపోతాయని హైకోర్టు పేర్కొంది. అదనంగా, వార్డుల వారీగా జనాభా సంఖ్యతో పాటు మ్యాప్‌లను 24 గంటల్లోపు పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని జీహెచ్ఎంసీకి ఆదేశించింది. ఇది ప్రజలు అభ్యంతరాలు సమర్పించడానికి సహాయపడుతుందని కోర్టు అభిప్రాయపడింది. సెన్సస్ కమిషనర్ ఇచ్చిన డిసెంబర్ 31 డెడ్‌లైన్ గురించి అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించి 150 నుంచి 300 వార్డులకు పెంచుతూ డిసెంబర్ 9న ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అయింది. దీనిపై వెల్లువలా అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, సరిహద్దులు అశాస్త్రీయంగా ఉండటం వంటి ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆదేశాలతో డీలిమిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా సాగే అవకాశం ఉంది. ప్రజలు తమ అభ్యంతరాలు సమర్పించుకోవడానికి అదనపు సమయం లభించింది.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను కొట్టివేత

**మొదటి పేజీ తరువాయి**



మిగతా ముగ్గురి విచారణ పూర్తయింది. వారి పై నిర్ణయం కూడా త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. గతంలో స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంతో స్పీకర్ జాప్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జులై 2025లో సుప్రీంకోర్టు 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అక్టోబర్ 31, 2025 గడువు ముగిసినా నిర్ణయం తీసుకోకపోవడంతో 17న సుప్రీంకోర్టు "గ్రాస్ కంటెంప్ట్" అంటూ హెచ్చరించి, 4 వారాల్లో అంటే డిసెంబర్ 18లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఒత్తిడి కారణంగా స్పీకర్ విచారణలు వేగవంతం చేసి, ఐదుగురిపై తొలి దశ తీర్పు ఇచ్చారు. ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లుగా ఆధారాలు ఉన్నాయని బీఆర్ఎస్ లాయర్లు స్పీకర్ ఎదుట వాదించారు. కాంగ్రెస్ సమావేశాలకు హాజరై, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని, ప్రసంగాలు చేశారు. వీడియోలు, ఫోటోలు, ప్రకటనలు ఆధారాలుగా సమర్పించారు. ఇది స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం వదులుకున్నట్లఅని వారన్నారు. అయితే పార్టీలో అధికారికంగా చేరలేదు. సీఎం రేవంత్ రెడ్డితో భేటీలు కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే. పార్టీ మారినట్లు స్పష్టమైన ఆధారాలు లేవన్నారు. వీరి వాదనకే స్పీకర్ మొగ్గు చూపారు. అయితే స్పీకర్ నిర్ణయంపై భారత రాష్ట్ర సమితి న్యాయపోరాటం చేసే అవకాశం ఉంది. మగిలిన వారిపై నిర్ణయం ప్రకటించే వరకూ ఎదురు చూస్తారా.. లేదా వెంటనే వెళ్తారా అన్నది బీఆర్ఎస్ హైకమాండ్ నిర్ణయం తీసుకోనుంది.

## భారత్ పాస్ పోర్టుతో ఆస్ట్రేలియాలో నివాసం: డీజీపీ శివధర్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

అతను 1998వ సంవత్సరంలో విద్యార్థి వీసాపై ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లాడు. అంటే, సుమారు 27 ఏళ్ల కిందట అతను భారత్ నుంచి వలస వెళ్లాడు. ముఖ్యంగా గమనించదగిన విషయం ఏంటంటే సుదీర్ఘ కాలంలో సాజిద్ ఆస్ట్రేలియా పౌరసత్వం తీసుకోకుండా ఇప్పటికే భారతీయ పాస్‌పోర్ట్‌తోనే కొనసాగుతున్నట్టు దర్యాప్తులో తేలింది. అతను హైదరాబాద్‌లో బీకాం పూర్తి చేసి ఆ తర్వాతే ఆస్ట్రేలియాకు వెళ్లినట్టు డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు.

## జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజనలో అవకతవకలు

- రాజేంద్రనగర్‌లో బీజేపీ ధర్నా

**దశ, రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం, శంషాబాద్ మున్సిపాలిటీ, GHMC వార్డుల పునర్విభజనలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీఇన్‌చార్జ్‌తోకలశ్రీనివాస్‌రెడ్డిమాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పునర్విభజన శాస్త్రీయంగా లేకుండా ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా విస్మరించి చేపట్టిందని విమర్శించారు. రాజేంద్రనగర్, శంషాబాద్ ప్రాంతాల్లో జరిగిన విభజనను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహానగర శివారు ప్రాంతాలను విలీనం చేస్తూ మజ్లిస్ పార్టీకి లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందని, ఏఐఎంఐఎం పార్టీని బలపరిచే లక్ష్యంతోనే ఈ పునర్విభజన చేపట్టిందని ఆరోపించారు. ఈ నిర్ణయం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ సమాజాన్ని అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పరిధిలోని తమ సొంత గ్రామం బాచుపల్లిలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి వోటు హక్కును వినియోగించుకున్నారు.
-(దశ, కందుకూరు)


## ఆగని పైరసీ

**మొదటి పేజీ తరువాయి**

రవి దొరకగానే.. అతనే పైరసీ కింగ్ అని చెప్పారు. కానీ.. అతను పైరసీ మాఫియాలో చిన్న పార్ట్ మాత్రమే.మనకు ఇంకో డౌట్ రావచ్చు. ఓటీటీలో సినిమాల్ని అతను పైరసీ చేసేవాడు కదా. ఇక ఇప్పుడు ఆ పైరసీ ఆగిపోయినట్లే కదా అని. అంత లేదు. ఆ పైరసీ కూడా ఆగలేదు. రవి ఏం చేసేవాడంటే.. DRM టెక్నాలజీని వాడేవాడు. దీని ద్వారా ఓటీటీ సినిమాలను ప్లే చేస్తూ.. స్క్రీన్ రికార్డ్ చేసేవాడు. అదే సమయంలో.. ఆడియో కూడా రికార్డ్ అయ్యేది. అలా రికార్డ్ అయిన సినిమాల్ని ఐబొమ్మ, బొప్పం వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశాడు. రవి అరెస్టు అయిన తర్వాత కూడా ఓటీటీ సినిమాలు పైరసీ అవుతూనే ఉన్నాయి. చాలా మంది DRMని వాడి.. పైరసీ చేస్తున్నారు. అంటే.. రవి అనే వ్యక్తి.. ఈ పైరసీ మాఫియాలో కింగ్ కాదు. అతని అరెస్టుతో పోలీసులు సాధించేది ఏమీ లేదని తేలిపోతోంది.

## ఇనుప ఖనిజ నిల్వల గుర్తింపుపై కేంద్రం నిర్లక్ష్యం

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**దశ, వరంగల్:** వరంగల్ జిల్లాలో ఉన్న భారీ ఇనుప ఖనిజ నిల్వలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య ఆరోపించారు. ఈ విషయంపై ఆమె పార్లమెంట్‌లో ప్రశ్న లేవనెత్తారు. వరంగల్ జిల్లాలో ఖనిజ సంపదపై స్పష్టత ఇవ్వాలని, గనుల అభివృద్ధి ప్రణాళికలు, పర్యావరణ అనుమతులు, స్థానిక సంస్థలకు ఆదాయ భాగస్వామ్యం, గనుల భద్రతా తనిఖీలపై కేంద్ర ప్రభుత్వ విధానాన్ని ఆమె ప్రశ్నించారు.

వరంగల్ జిల్లాలో సుమారు 40 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో అంగీకరించినప్పటికీ, ఇప్పటివరకు వాటి అభివృద్ధి ఎందుకు ముందుకు సాగడం లేదని ఎంపీ నిలదీశారు.

ఈ ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సమాధానం ఇస్తూ, భారతీయ గనుల బ్యూరో రూపొందించిన జాతీయ ఖనిజ జాబితా (నేషనల్ మినరల్ ఇన్వెంటరీ) ప్రకారం 2025 ఏప్రిల్ 1 నాటికి వరంగల్ జిల్లాలోని ఇనుప ఖనిజ నిల్వలు 'రిమైనింగ్ రిసోర్సెస్' కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గనుల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తూ, తెలంగాణ ప్రాంతాల పట్ల వివక్ష చూపుతోందని డా. కడియం కావ్య ఆరోపించారు.

వరంగల్ వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలనీ, ఖనిజ సంపదను ప్రజల సంక్షేమానికి ఉపయోగించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.